
ఈవారం కథ





# చికిత్స

— మోహన్

అతను కళ్ళు తెరిచాడు.

కానీ చూపు మాత్రం క్షితిజంవైపు చూస్తున్న వేదాంతి చూపులాగుంది. మొహం, రంగులు చెరిపేసిన కాన్వాసులా, భావ రహితంగా వుంది. పాతిక ఏళ్ళు మించని ఆ యువకుడికి ఉదయం షాక్ ట్రీట్‌మెంట్ జరిగింది.

రోగికి సెన్సొచ్చిందని నర్స్ చెప్పడంతో గదిలోకొచ్చాడు సైకియాట్రిస్ట్ అరవింద్. అంతవరకూ కొడుకు తల నిమురుతున్న తల్లి లేచి నిలబడింది. పల్స్ చూసి సంతృప్తికరంగా తల పంకించి తల్లితో చెప్పాడు అరవింద్ "కొంచెంసేపు రెస్ట్ తీసుకున్నాక వేడి పాలివ్వండి"

ఆమె చేతులు జోడించింది. "మీరే కాపాడాలి బాబూ...ఈడు తప్ప నాకు మరో దిక్కు..." ఆమె పెదవులు మాట పూర్తి చేయలేక పోయాయి.

"భయం లేదు నయమైపోతుంది. నే చెప్పేవంత వరకూ ట్రీట్‌మెంట్ మానొద్దు..." అని తన గదివైపు నడిచాడు అరవింద్.



స్టెత్ టేబిల్‌పై పడేసి కుర్చీలో వాలి అలసటగా కళ్ళు మూసుకున్నాడు. ఆ యువకుడి శూన్యపు చూపే కళ్ళ ముందు మెదిలింది.

పాపం తండ్రి చిన్నప్పుడే పోయాడు. తల్లి కూలి చేసి చదివించింది. ముని సిపాలిటీ లైటు వెలుగులో డిగ్రీ పూర్తి చేశాడు. కాయలు కాసిన తల్లి అరిచే

తుల్ని నిమిరి ఇక నిన్ను పన్లోకి పోనివ్వ వని హామీ ఇచ్చాడు–డిగ్రీ చేతికొచ్చిన రోజు. కానీ అతని ఊహ తలకిందు లైంది. కష్టపడి సంపాదించిన డిగ్రీతో ఎంత కష్టపడినా ఉద్యోగం లభించ లేదు. ఇరవై ఏళ్ళ తపస్సుకి అర్థం లేకుండా పోయిందనే వాస్తవం అతని మస్తిష్కానికి పిడుగులా తాకింది...ఫలి తంగా డిప్రెషన్... ఆశ జీవితం నుంచి మృత్యువుపైకి మరలింది. రోగంగా మారిన చావుపట్ల ఆసక్తి, ఆత్మహత్యా ప్రయత్నానికి దోహదం చేసింది. చేయి జారక ముందే గుప్పిట బిగించబట్టి సరి పోయింది. లేకుంటే ఈ పాటికి తల్లి గుండెల్లో చితి రగిల్చి వెళ్ళిపోయేవాడా యువకుడు.

భారంగా నిట్టూర్చాడు అరవింద్. తను మానసిక వైద్యుడు. రోగాలకి కారణాలు మనిషి మనసుల్లో వెద కాలి. కానీ అధిక శాతం రోగాలకి వేళ్ళు మనసుల్లో కాదు సమాజపు పొరల్లో ఉన్నాయి. ఆ పొరల్ని చీల్చ కుండా మెదళ్ళకి చికిత్స చేయడం వేళ్ళు పెకలించకుండా ఆకుల్ని కత్తిరిం చడమని తెలుసు...కానీ తను చేయ గలిగింది ఏమీ లేదు. అలా అని అందరిలా నిర్లిప్తంగా తన డ్యూటీ చేసుకు పోలేదు. అందుకే తన పేషెం ట్లతోపాటు తను కూడా 'కాంపోజ్' బిళ్ళలనే ఆశ్రయించాల్సి వస్తుంది...మ నసుని నిద్రపుచ్చేందుకు.

తలుపు చప్పుడవడంతో తేరుకున్నాడు అరవింద్. కొద్దిగా తలుపు సందు లోంచి తల లోనపెట్టి చెప్పాడు ప్యూన్. సూపరింటెండెంట్ పిలుస్తున్నారని.

సూపరింటెండెంట్ గదిలో కూర్చున్న బాట్ నాగర్‌ని చూడగానే విషయం అర్థమైపోయింది అరవింద్‌కి.

బాట్‌వాగర్–ప్రభుత్వ ఆస్పత్రులకి మెడికల్ ఎక్విప్‌మెంట్స్ సప్లై చేసే కాంట్రాక్టరు. కొన్ని ఎక్విప్‌మెంట్లు అతని సొంత ఫ్యాక్టరీల్లోనే తయా రవుతాయి. హెల్త్ మినిస్ట్రీలో అత నికున్న పలుకుబడివల్ల సూపరింటెం డెంట్ లెవల్ అధికార్లు కూడా అతనితో 'హెల్తీ రిలేషన్స్' వుంచుకుం టారు. ప్రస్తుతం 'ఎలక్ట్రో కన్‌వల్సివ్ థెరపీ'కి కావలసిన ఎక్విప్‌మెంట్ కేసు పెండింగ్‌లో వుంది.

ఎలక్ట్రిక్ షాక్ ద్వారా శరీరంలో తీవ్ర ప్రకంపనాల్ని సృష్టించి, మానసిక వ్యాధుల్ని నయం చేసే పద్ధతి–ఎలక్ట్రో కన్‌వల్సివ్ థెరపీ 'వోల్టేజ్ స్టెబిలైజర్' లాంటి ఒక ఎక్విప్‌మెంట్. రోగి తట్టు కునే విధంగా విద్యుత్తు శక్తినీ, మోతా దునీ నియంత్రించి అతని కణతలపై అమర్చిన ఎలక్ట్రోడ్స్ ద్వారా షాక్ ఇవ్వ డానికి ఉపయోగపడుతుంది. ఈ ఎక్విప్ మెంట్ ఏమాత్రం 'డిఫెక్టివ్' అయినా హైవోల్టేజి కరెంటు నేరుగా రోగి కణ తల్ని తాకి ప్రాణాలు తీస్తుంది.

బాట్‌వాగర్ సప్లై చేసిన ఎక్విప్‌మెం ట్లలో రెండు పీస్‌లు 'లీక్' అని తెల టంతో మొత్తం బాచ్‌ని రిజెక్ట్ చేసేడు అరవింద్. దాంతో బాట్‌నాగర్ సూప రింటెండెంట్‌ని ఆశ్రయించాడు.

గదిలోకొచ్చిన అరవింద్‌ని సూపరిం టెండెంట్ చాలా ప్రేమగా కుర్చీ చూపిం చాడు. బాట్‌వాగర్ మహా మర్యాదగా పలకరించాడు.

'డిఫెక్టివ్ పీసెస్‌ని రిప్లేస్ చేసి ఎక్విప్ మెంట్స్ పాస్ చేసే'మని అనునయంగా ఆర్డరిచ్చాడు సూపరింటెండెంట్.

'మొత్తం బాచ్‌ని రీటెస్ట్‌కి పంపించిన తర్వాతగానీ పాస్ చేయడం సాధ్యం కాద'ని వినయంగానే అడ్డు చెప్పాడు అరవింద్.

సూపరింటెండెంట తన అధికా రంతో బాట్‌వాగర్ తన పలుకుబడితో అతన్ని ఎన్ని అవస్థలపాల్జెయ్యగలరో వివ రించి అదరగొట్టబోయేరు. అరవింద్ బెదరలేదు.

బాట్‌వాగర్ ఆఖరు అస్త్రంగా ఓ 'అంకె' చెప్పాడు.

ఆఖరి మాటగా 'షటప్' అని లేచి వచ్చేశాడు అరవింద్.

* * *

'ఫాదర్ సీరియస్' అని టెలిగ్రామ్ అందడంతో స్వగ్రామం వెళ్ళిన అర వింద్...నెల దాటేకగానీ తిరిగి రాలేక పోయాడు. డ్యూటీలో రెజ్యూమయి ఛార్జి తీసుకుని వార్డులో అడుగెట్టిన అరవింద్ ఠక్కున ఆగిపోయాడు.

ఎదురుగా తెల్లటి దుప్పటి పరిచిన ఖాళీ బెడ్... కొత్తగా సున్నం వేసిన సమాధిలా వుంది.

"ఈ బెడ్‌లో వుండే కుర్రాడేమ య్యాడు?" మనసు మూరుమూల లోంచి అర్థం అయీ అవని భావన అలజడి చేస్తుండగా అడిగాడు.

"ఎలక్ట్రిక్ ప్లగ్‌లో చేయి పెట్టి సూసైడ్ చేసుకున్నాడు..." నర్స్ మాటలు పూర్తి కాలేదు..."నో" అంటూ ఆస్పత్రి అదిరిపోయేలా అరిచి షాక్ ట్రీట్‌మెంట్ రూంలోకి పరిగెత్తాడు.

అక్కడ–కుందేలు పిల్లల్ని మింగి సంతృప్తిగా చుట్టచుట్టుకుని నిద్రపో తున్న కొండచిలవలా–నిగనిగ లాడు తోంది బాట్‌వాగర్ ఎక్విప్‌మెంట్.

అరవింద్‌కి అంతా అర్థమైపోయింది. అతని కళ్ళ ముందు శూన్యపు చూపుల యువకుడు చిర్నవ్వుతో పాడెక్కి వెళ్ళి పోతున్నాడు. పాడెని అతని తల్లే మోస్తోంది. పాడె నాలుగు కొసలు అతని తల్లే...బుజానికి కన్నీరు తుడు చుకొంటూ! అంత వరకూ ట్రాంక్వి లైజర్స్ మత్తులో అణిగిపోయిన అర వింద్ హృదయం ఒక కెరటంలా గొంతు విప్పింది. "యూ–డెవిల్" అంటూ స్టూల్‌ని ఎక్విప్‌మెంట్‌పై విసి రికొట్టాడు. 'వాట్ హాపెండ్' అని పరి గెత్తుకొచ్చిన సూపరింటెండెంట్ కాలరు పట్టుకున్నాడు. అలా ఆవేశంలో ఎంత బీభత్సం సృష్టించాడో అతనికే తెలీదు... చివరికి పదిమంది కలిసి బలవంతంగా అతన్ని ఆస్పత్రి బయటికి నెట్టేశారు.

ఆవేశంతో శరీరం కంపిస్తుండగా బౌండ్రీ దాటి రోడ్డెక్కాడు అర వింద్. ఆ యువకుడి శూన్యపు చూపులు వీపుపై బాణాల్లా గుచ్చు కుని వెంటాడుతున్నాయి. ఎక్కడెక్కడ తిరిగాడో అలా ఎంతసేపు తిరిగాడో అతనికే తెలీదు–చివరికి సత్తువ సన్న గిల్లి పార్క్ బెంచీలో కూలబడిపోయి కళ్ళు మూసాడు.

స్పృహొచ్చేనరికి అర్థరాత్రి దాటింది. ఆకాశంలో చుక్కలు జాలి జాలిగా చూస్తున్నాయి. దూరంగా స్ట్రీట్ లేంప్ వెలుగులో ఇద్దరు యువకులు గోడపై ఏదో రాస్తున్నారు. ఇంతలో పోలీసు జీప్ సైరన్ వినిపించడంతో యువ కులు రాతవొదిలేసి చీకట్లో కలిసి పోయేరు. పోలీసులు జీపాపి...అటూ ఇటూ చూసి ఎవరూ కానరాకపో వడంతో రంగు డబ్బాని తన్నేసి వెళ్ళిపోయారు.

అరవింద్ లేచి అటు నడిచాడు. నీరసం వలన అడుగులు తడబడుతు న్నాయి.

గోడపై అబార్టెడ్ పిండం ఖండాల్లా... ఇంకా తడి ఆరని ఎర్రటి ముద్దల్లాంటి అక్షరాలతో అసంపూర్తి వాక్యం 'సామా జిక రుగ్మతలకు ఏకైక పరిష్కారం...'

అరవింద్ ఆ వాక్యాన్నే నిదానంగా చూస్తూ కొన్ని గంటలసేపు నిలబడిపో యాడు. తూర్పు ఎర్రబడింది. ఎక్కడో దూరంగా కోడి కూసింది.

అరవింద్ కదిలాడు. ఆపరేషన్ చేసేందుకు స్కాల్‌పెల్ అందుకు న్నట్టు బ్రష్‌ని అందుకున్నాడు. పగిలిన గుండెలా వున్న ఎర్ర రంగు ఒలి కిన డబ్బాలో ముంచి వాక్యం పూర్తి చేశాడు 'వ్యవస్థకి శస్త్ర చికిత్స'. ●

## రెండో స్థానం

ఒక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తన విద్యార్థులకు చెబుతున్నాడు – "జ్ఞాపకం పెట్టు కోండి! మీరు ఎవ్వరూ ప్రథమ స్థానంలో వుండలేరు. గొప్ప వ్యక్తులు సయితం కొన్నాళ్ళు ద్వితీయ స్థానంలో వుండవలసి వస్తుంది".

అప్పుడు ఒక చురుకైన విద్యార్థి అన్నాడు.

"జార్జివాషింగ్‌టన్ సంగతేమిటండీ? అతడు అమెరికా మొదటి అధ్యక్షుడు. యుద్ధంలో ప్రథ ముడు. శాంతిలో ప్రథముడు. తన దేశ ప్రజల హృదయాల్లో ప్రథమ స్థానం పొందినవాడు"

"నిజమే"... జవాబిచ్చాడు సూక్ష్మబుద్ధిగల ఉపాధ్యాయుడు... "అయినా మర్చిపోవద్దు. అతడు ఒక వితంతువును పెళ్ళిచేసుకు న్నాడు".

